క్లుప్తంగా

30 నుంచి గిడ్డాంజనేయ స్వామి జయంతుత్సవాలు


వెంకటగిరిలోని గిడ్డాంజనేయస్వామి

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో వెలసిన గిడ్డాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఈనెల 30న విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ, 31న సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అలంకరణ, అర్చన, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, ప్రభోత్సవం, జూన్ 1వ తేదీ గిడ్డాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, సాయంత్రం స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు, నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నీటి పొదుపు అందరి బాధ్యత


తిమ్మందొడ్డిలో నీటి కుంటను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: మండల ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో మంచినీటి కుంటలు, బోర్లు, పథకాలను పరిశీలించారు. తుంగభద్ర నదిలో ఆయా గ్రామాలకు ఏర్పాటు చేసిన మంచినీటి వనరులను పరిశీలించి అక్కడి వారితో నీటి వినియోగంపై మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. అదే విధంగా కంబదహాల్ గ్రామంలో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలించి, వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి అభిషేకంకు సూచించారు.

రోడ్డుపై మురుగు తొలగించరూ


రోడ్డుపై నిలిచిన మురుగు

కల్లూరు:మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో పాఠశాల వద్ద రోడ్డుపై మురుగు నీరు నిలుస్తోంది. దోమలు, లార్వాలు వృద్ధి చేందకముందే సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వర్షాలు కురిస్తే దోమలు ప్రభాలే అవకాశం ఉందని.. రోడ్డుపై మురుగు నీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు

గూడూరు: గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కుమారి జయశ్రీ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగు నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందన్నారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయించాలని సూచించారు. దోమల నివారణతో పాటు మురుగు నిల్వ చేరకుండా చూడాలన్నారు.

ఏపీఈఆర్‌సీ కార్యాలయం ప్రారంభించడం హర్షణీయం

● రఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా ఏపీఈఆర్‌సీ కార్యాలయాన్ని హైదరాబాద్ నుంచి కర్నూలుకు తీసుకురావడం సర్వత్రా హర్షణీయమని రాయలసీమ యూనైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి అన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెబుతున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే హైకోర్టును కూడా కర్నూలులో ఏర్పాటు చేయాలన్నారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ ఉద్యమ సంఘాలు గతంలోనే డిమాండ్ చేశాయన్నారు. అలాగే కర్నూలును సీడ్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థ ప్రధాన కార్యాలయాలను కూడా కర్నూలులోనే ఏర్పాటు చేయాలన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కర్నూలును న్యాయ రాజధానిగా చేసి శ్రీ బాగ్ ఒప్పందాన్ని అమలు చేసేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలన్నారు. ఏపీఈఆర్‌సీ కార్యాలయం ఏర్పాటుకు సంబంధించి ఇంత హడావుడిగా ఎందుకు ప్రారంభించాలని కోస్తాంధ్ర నాయకులు ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు.

వ్యాధుల కాలం.. ఆరోగ్యం భద్రం

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు, కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వర్షాలకు వీధులు, కాలువల్లో నీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఈ కాలంలోనే డెంగీ, మలేరియా ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది. జ్వరాలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవచ్చని చెబుతున్నారు. గ్రామాల్లో దోమల నివారణపై దృష్టి సారించారు.

- వాతావరణ మార్పులతో విషజ్వరాల వ్యాప్తికి అవకాశం
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు దూరం
- వర్షాలతో వృద్ధి చెందుతున్న దోమలు
- డెంగీ, మలేరియా నివారణకు వైద్యశాఖ చర్యలు
- ముమ్మరంగా ఫీవర్ సర్వే


బూజునూరులో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య ఉద్యోగిని


మురుగుకాలువల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

గడివేముల: అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల తాగునీరు కలుషితమవుతున్నాయి. మరి కొన్ని చోట్ల వర్షపు నీరు వీధుల్లో నిలిచి దోమలు పెరిగి పలు రకాల జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. వ్యాధుల కట్టడికి వైద్య సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి విషజ్వరాల పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. డెంగీ నిర్ధారణ అయితే వెంటనే రక్త కణాల పరీక్షలు జరిపి,పరిస్థితి తీవ్రంగా కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్లేట్‌లెట్స్ తక్కువ ఉన్న రోగులకు రక్తం, ప్లేట్‌లెట్స్ కోసం రెఫర్ చేస్తున్నారు. ప్రజలు ఇళ్లలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని పేర్కొంటున్నారు.

వ్యాధులు.. వాటి లక్షణాలు

టైఫాయిడ్

కలుషిత ఆహారం, నీరు ద్వారా సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా టైఫాయిడ్ వ్యాపిస్తుంది. 103 నుంచి 104 డిగ్రీల వరకు జ్వర తీవ్రత ఉండడం.. వాంతులు, విరేచనాలు, ఆకలి మందగించడం, తల, కడుపునొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం దీని లక్షణాలు.

డెంగీ

కేవలం దోమ ద్వారా మాత్రమే వచ్చే వ్యాధి డెంగీ. స్వచ్ఛమైన నీటిలో తిరుగుతూ పగటిపూట మాత్రమే కుట్టే దోమ ఇది. ఈ దోమ కుట్టిన 2-7 రోజుల మధ్య వణుకుతో పాటు జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఒంటి నొప్పులతో పాటు కీళ్ల, కండరాల నొప్పులు, ఆకలి మందగించడం, ఛాతీపై ఎర్రటి మచ్చలు రావడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిపోవడం, లోబీపీ, చర్మంపై దద్దుర్లు, పొట్టలో వికారంగా ఉంటుంది.

మలేరియా

ప్లాస్మోడియం జాతి సూక్ష్మక్రిముల మూలంగా ఎనాఫిలిస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాపిస్తుంది. ఈ దోమ కుట్టిన వ్యక్తి రక్తంలోకి ప్రవేశించిన సూక్ష్మక్రిములు కాలేయాన్ని చేరుకుని, కాలేయ కణాల్లోకి చొచ్చుకెళతాయి. ఇవి సంతానాన్ని వృద్ధి చేసి మలేరియా వ్యాధిని కలిగిస్తాయి. వస్తూ పోయే జ్వరం, కడుపులో అసౌకర్యం, చలితో వణుకు, కొంత సేపటికే చెమటలు మలేరియా లక్షణాలు.

కామెర్లు

కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధి కామెర్లు. ఇది హెపటైటిస్-బి, హెపటైటిస్-సి వంటి ఇన్ఫెక్షన్లతో కామెర్లు వచ్చే అవకాశం ఉంది. కళ్లు, చర్మం పసుపు పచ్చగా మారడం, రక్తంలో బైలురూబిన్ స్థాయి పెరగడం, ఆకలి మందగించడం, జ్వరం, గొంతునొప్పి, మూత్రం పచ్చగా రావడం, కడుపునొప్పి లక్షణాలుంటాయి.

డయేరియా

బ్యాక్టీరియా, వైరల్, పరాన్న జీవుల ఇన్ఫెక్షన్ మూలంగా నీళ్ల విరేచనాలు వస్తాయి. రోజుకు మూడు అంతకన్నా ఎక్కువగా నీళ్ల విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించవచ్చు. ఈ వ్యాధితో ఒంట్లో ఉండాల్సిన నీటి శాతం తగ్గిపోయి ముఖ్యమైన లవణాలు(బైకార్బొనేట్, పొటాషియం) బయటకుపోవడం ద్వారా డీహైడ్రేషన్‌కు దారి తీస్తుంది.

నివారణ చర్యలు

విషజ్వరాల కట్టడికి పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాల గురించి వివరిస్తున్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతూ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జ్వరాలు వచ్చిన వారితో పాటు అనుమానితుల రక్త నమూనాలను సేకరిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. సాల్మొనెల్లా టైఫీ బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తిచెందే టైఫాయిడ్‌తో పాటు డయేరియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణంతకమని డాక్టర్ తేజస్వినీ తెలిపారు. బ్యాక్టీరియా కారకం ద్వారా కాలుష్యానికి గురయ్యే నీటిని సేవించడం వల్ల ఈ వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. మలేరియా నివారణ కోసం చేపడుతున్న డ్రైడే బహుళ ప్రయోజనాలు ఇస్తుందన్నారు. మంచి నీటి నిల్వలో పెరిగే బ్యాక్టీరియా నివారణకు క్షేత్రస్థాయిలో సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉన్నచోట పరిశీలించి క్లోరినేషన్ చేయిస్తున్నారని తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలేకుండా చూసుకోవాలి.
- మల, మూత్ర విసర్జన అనంతరం సోపుతో చేతులు శుభ్రపరుచుకోవాలి.
- కాచి చల్లార్చిన నీరు, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, టైర్లు, వాటర్ బాటిళ్లు, కూలర్‌లలో నీరు నిల్వ ఉంచరాదు.
- పండ్లు, కూరగాయలు శుభ్రంగా కడిగిన తర్వాతే తినాలి.
- చిన్న పిల్లలకు ఒంటిని పూర్తి కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి. ఇళ్లలో దోమతెరలు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల కంటే జ్వరం తగ్గకుంటే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలి. అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, యాంటి బయోటిక్స్, సెలైన్ బాటిల్స్, రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు నీటిని కాచి తాగాలి. అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

–డాక్టర్ మొల్లా జబీన్, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, గడివేముల

గడివేములలో 20.2 మి.మీ వర్షపాతం


తహసీల్దార్ కార్యాలయం వద్ద విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

గడివేముల: మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. మండల వ్యాప్తంగా సుమారు 65 స్తంభాలు నెలకొరిగినట్లు తెలిసింది. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయల వద్ద భారీ వృక్షాలు విద్యుత్ స్తంభాలపై పడడంతో విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

ఏజెంట్ల ఎంపికలో బిజీబిజీ

- సమీపిస్తున్న ఓట్ల లెక్కింపు గడువు
- కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్ల నియామకానికి ప్రధాన పార్టీల కసరత్తు
- నేర చరిత్ర లేని వారికి మాత్రమే ఎన్నికల సంఘం అనుమతి
- ఆ మేరకు వివరాలు కోరుతూ అభ్యర్థులకు అధికారుల ఆదేశం

కర్నూలు: ఎన్నికల రణరంగంలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలేందుకు పదిరోజులే మిగిలింది. దీంతో ఓట్ల లెక్కింపు రోజు చేయాల్సిన కార్యక్రమాలపై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లను నియమించుకునేందుకు కసరత్తు చేపట్టాయి. ఎప్పటికప్పుడు కౌంటింగ్ సరళిని గమనించేందుకు ముఖ్య నాయకులకు బాధ్యతలు అప్పగిస్తున్నాయి.

బూత్ స్థాయి నేతలే కీలకం..

ఓట్ల లెక్కింపునకు సంబంధించిన ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని ప్రధాన పార్టీల నాయకత్వాల నుంచి అభ్యర్థులకు ఆదేశాలు అందాయి. అన్ని దగ్గరుండి చూసుకోకపోతే నష్టపోతారంటూ టీడీపీ అధిష్టానం జిల్లాకు చెందిన పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులను ఆదేశించింది. పోలింగ్ రోజున తమ పార్టీకి ఓటు వేసేలా చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన బూత్ స్థాయి నేతలతో ప్రధాన రాజకీయ పార్టీలు అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ ఏజెంట్ల ఎంపికలో బిజీగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా బూత్ స్థాయి నేతలు ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులకు అన్నీతామై వ్యవహరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో కూడా గోల్‌మాల్ జరగకుండా చూసేందుకు ఇరు పార్టీలు వారినే ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. జూన్ 4వ తేదీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు రాయలసీమ యూనివర్సిటీలో జరుగుతుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ఏజెంట్ల వివరాలు అందజేయాలని ఎన్నికల అధికారులు సూచించడంతో జాబితా సిద్ధం చేస్తున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు టేబుల్‌కు ఒకరు చొప్పున ఏజెంట్లను నియమించుకోవచ్చు. అభ్యర్థితో పాటు నియోజకవర్గాల్లో జరిగే పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌ను పరిశీలించేందుకు ఒక ముఖ్య ఏజెంటు కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.

నిబంధనలు ఇవి...

గతంలో జరిగిన ఎన్నికల్లో ఏజెంట్లుగా పని చేసిన వారినే ప్రధాన రాజకీయ పక్షాలు ఏజెంట్లుగా నియమించుకుంటున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 4వ తేదీ ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏజెంటు గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తారు. అయితే ఏజెంట్ల వివరాలు ఫాం-18లో సమర్పించాల్సి ఉంటుంది. పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపునకు సంబంధించి రాజకీయ పార్టీలు కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు ఫాం-18లో రెండు ఇవ్వాలని అధికారులు ఆదేశించారు. వాటి ఆధారంగా ఏజెంట్లకు పాసులు జారీ చేస్తారు. ఒక సెట్‌ను పోలీసు విభాగానికి పంపి వారి నేరచరిత్ర పూర్తి వివరాలు పరిశీలిస్తారు. ఎలాంటి కేసులు లేని వారిని ఏజెంట్లుగా అనుమతిస్తారు. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర్య అభ్యర్థులు కూడా నేర చరిత్ర లేనివారిని తమ ఏజెంట్లుగా నియమించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

హిందీ పరీక్షకు 18 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో శనివారం జరిగిన పదో తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండ గా 8 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజర య్యారని పరీక్ష కేంద్రం డిపార్టుమెంటల్ అధి కారి అనంతయ్య తెలిపారు. అలాగే మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 19 మంది పరీక్ష రా యాల్సి ఉండగా 9 మంది గైర్హాజరయ్యారని పాఠశాల పరీక్షల చీఫ్ ధనుంజయగౌడ్ పేర్కొన్నారు.

చిన్నారులందరికీ టీకాలు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులందరికీ సమయానుసారంగా టీకాలు వేయించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక రోజా వీధిలోని సచివాలయం-2లో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలు తమ పరిధిలో అర్హులైన గర్భిణులు, చిన్నపిల్లలందరికీ వ్యాక్సిన్‌లు వేయాలన్నారు. ఎంఆర్-1, ఎంఆర్-2 వ్యాక్సిన్‌లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఏఎన్ఎం యాప్, హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణి వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. అనంతరం గర్భిణులకు ఐరన్ మాత్రలు, పిల్లలకు ఐరన్, విటమిన్ ఎ. సిరప్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోజా యూపీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ ఎస్. ఫాతిమా, డీసీహెచ్ఎం ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రగ్బీ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): ఈనెల 31 వ తేదీ నుంచి వచ్చే నెల 1 వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా తిమ్మాపురంలో జరిగే 9 వ రాష్ట్ర స్థాయి రగ్బీ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి జట్టుకు క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జట్టులో ఎంపికయిన క్రీడాకారులు ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో చోటు సంపాదించుకోవాలన్నారు. అలాగే వచ్చే నెల 19, 20 తేదీల్లో మహారాష్ట్రలోని పూణేలో నిర్వహించనున్న జాతీయ స్థాయి రగ్బీ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పరశురాముడు, మహబూబ్, సుభాని, రాఘవేంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చర్చి ప్రారంభోత్సవం



ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, క్రైస్తవులు, చర్చిని ప్రారంభిస్తున్న కాటసాని, బిషప్

పాణ్యం: మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన చర్చిని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, రాయలసీమ మండల అధ్యక్షుడు బిషప్ ఐజక్ వరప్రసాద్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇతరులపై ప్రేమ, దయతో మెలగడమే ఏసు తత్వం అని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిడి దూరం అవుతుందని తెలిపారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ప్రారంభోత్సవం సందర్భంగా బొమ్మల దుకాణాలు, ఇతర దుకాణాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ సద్దల సుజితోరెడ్డి, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లపై పడిన చెట్టు కొమ్మలు



పాణ్యంలో విద్యుత్ వైర్లపై విరిగిపడిన చెట్టు కొమ్మ , తొలగిస్తున్న సిబ్బంది

పాణ్యం: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈదురుగాలులకు స్థానిక దర్గా వద్దనున్న విద్యుత్ వైర్లపైకి చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కొమ్మ పడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులు చెట్టు కొమ్మలను తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

రక్తహీనతతో అనారోగ్య సమస్యలు


రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత కారణంగా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారిణి హేమలత చెప్పారు. శనివారం నగర శివారులోని భూపాల్‌నగర్ గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణులకు, కౌమార దశ బాలికలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత మూలంగా మహిళల్లో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అందులో అలసట, నీరసం వంటి సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు నెలసరి సమయంలో హెచ్చు తగ్గులు, గర్భం దాల్చకపోవడం, ఒకవేళ గర్భం వచ్చినా అది నిలవకపోవడం, ప్రసూతి మరణాలు పెరిగిపోవడం వంటి సమస్యలు తప్పవని తెలిపారు. దీన్ని అధిగమించాలంటే ఐరన్ అధికంగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, ఖర్జూరాలు, దానిమ్మ, చిక్కుడుకాయలు లాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని, అలాగే ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలని, జంక్‌ఫుడ్, శీతల పానియాలకు దూరంగా ఉండాలని సూచించారు.

దేశ రక్షణకు శ్రద్ధగా పనిచేయాలి



మాట్లాడుతున్న వీహెచ్‌పీ క్షేత్ర సంఘటనా మహా మంత్రి గుమ్మళ్ల సత్యం

కర్నూలు కల్చరల్: దేశ రక్షణకు విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు అందరూ శ్రద్ధగా పనిచేయాలని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటనా మహా మంత్రి గుమ్మళ్ల సత్యం అన్నారు. నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో నిర్వహిస్తున్న భాగ్యనగర క్షేత్ర వీహెచ్‌పీ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. తొమ్మిది రోజుల పాటు కార్యకర్తల్లో ఐక్యత, సమష్టి తత్వం, దేశ భక్తి గురించి వివరించారన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు సంస్థపై పూర్తి నిబద్ధతతో పనిచేసి సంస్థ విస్తరణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, క్షేత్ర గోరక్షా ప్రముఖ్ యాదగిరిరావు, ప్రాంత సంఘటనా మంత్రి శ్రీనివాసరెడ్డి, కేంద్రం వీహెచ్‌పీ ట్రస్ట్ సభ్యులు రామారావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ మూర్తి, తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి రాజేశ్వరరెడ్డి, సేవా ప్రముఖ్ దక్షిణాంధ్ర కో కన్వీనర్ గురుమూర్తి, వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్వర్, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, సహ కార్యదర్శులు గిరిబాబు, గోవిందరాజులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): బనగానపల్లె నుంచి కర్ణాటక రాష్ట్రంలోని టిప్‌టూర్‌కు అక్రమంగా లైమ్‌స్టోన్ చిప్స్ రవాణా చేస్తున్న లారీలకు జరిమానా విధించినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. ఒక్కో లారీకి రూ.50వేలు చొప్పున రెండు లారీలకు రూ.లక్ష అపరాధ రుసుం విధించి వసూలు చేసినట్లు శనివారం విలేకరులకు వెల్లడించారు.

కోల్‌కతా హైకోర్టు తీర్పు హర్షణీయం


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కల్లూరు: బీసీలకు అన్యాయం చేస్తూ వారి రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వడాన్ని రద్దు చేసి మమత లాంటి నాయకులు, తృణమూల్ వంటి రాజకీయ పార్టీలకు కోల్‌కతా హైకోర్టు బుద్ధి చెప్పిందని ఏపీ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చామకూర వీరప్ప అన్నారు. శనివారం పాణ్యం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ తీర్పు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించిన మమతకు చెంపదెబ్బ అన్నారు. ఏపీలో వెనుకబడిన తరగతుల వారికి (బీసీలకు) అన్యాయం జరిగితే సహించే ప్రసక్తే లేదన్నారు. రిజర్వేషన్ అనేది వెనుకబాటుతనం ఆధారంగా కల్పించారని తెలిపారు. ముస్లిం సమాజంలో పేదలను ఆదుకోవడానికి, పేదరిక నిర్మూలనకు ఎన్నో కార్యక్రమాలు చేయవచ్చన్నారు. అవేవి పట్టించుకోకుండా రాజకీయం కోసం మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇచ్చే వారికి కోర్టు కనువిప్పు కలిగించిందన్నారు. బీజేపీ నాయకులు శారద, వీరమ్మ, రమణ, ఎల్లప్ప, రవితేజ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.